లంచగొండులపై ఏసీబీ ఉక్కుపాదం

- ఈ ఏడాది ఇప్పటి వరకు 150కిపైగా కేసుల నమోదు
- అత్యధికంగా హోంశాఖలో 30 మంది అధికారుల అరెస్టు
- ఆ తర్వాతి స్థానాల్లో మున్సిపల్, రెవెన్యూ శాఖలు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే కొందరు ప్రభుత్వ అధికారులు అడ్డూ అదుపు లేకుండా లంచాల కోసం తెగబడుతున్నారు. వారి ధన దాహాన్ని తట్టుకోలేక ఎంతో మంది బాధితులు అవినీతి నిరోధకశాఖను ఆశ్రయిస్తున్నారు. దీంతో అలాంటి లంచావతారులను ఏసీబీ వలపన్ని పట్టుకుని, కేసులు నమోదు చేస్తున్నది. అలా ఈ ఏడాది ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 150కిపైగా కేసులు నమోదు చేసింది. వీటిలో 110కుపైగా ట్రాప్ (రెడ్‌హ్యాండెడ్) కేసులు, 10 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 10 క్రిమినల్ మిస్ కండక్ట్ కేసులు, 7 రెగ్యులర్ ఎంక్వయిరీ కేసులు, 26 ఆకస్మిక తనిఖీ కేసులు, 2 డిస్క్రీట్ ఎంక్వయిరీ కేసులు ఉన్నాయి. అత్యధికంగా హోంశాఖలో 30 మంది, మున్సిపల్ శాఖలో 22, రెవెన్యూలో 15 మంది అధికారులు అరెస్టయ్యారు. ఆగస్టు నాటికి 148 కేసుల్లో 229 మందిని ప్రాసిక్యూట్ చేసేందుకు నివేదిక పంపగా.. 72 కేసుల్లో 86 మందిని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది 12 కేసుల్లో అవినీతి అధికారులకు కోర్టులు శిక్షలు ఖరారు చేశాయి.

బినామీలపైనా గురి

ప్రభుత్వ విభాగాల్లోని ఏ అధికారైనా లంచం డిమాండ్ చేసినట్టు బాధితుల నుంచి సమాచారం అందగానే ఏసీబీ ట్రాప్‌ను సిద్ధం చేస్తున్నది. లంచం అడిగిన అధికారికి అనుమానం రాకుండా ఎర వేస్తున్నది. లిక్విడ్స్, నోట్లు, ఇతర ఆధారాలతో రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్టు చేస్తున్నది. అక్కడితో సరిపెట్టకుండా ఆ లంచావతారుల బినామీల వివరాలను ఆరా తీసి, వారి ఇండ్లలోనూ సోదాలు చేపడుతున్నది. తద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బులు, బంగారం, భూములు, ఇతర స్థిర, చరాస్తులను లెక్కగట్టి పక్కా ఆధారాలతో కోర్టుకు నివేదిస్తున్నది.

1064 టోల్‌ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం

అవినీతిపై ఉక్కుపాదం మోపేందుకు ఏసీబీ ఏర్పాటు చేసిన 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు విస్తృత స్పందన లభిస్తున్నది. బాధితుల నుంచి కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను డీఎస్పీ నేతృత్వంలోని బృందం ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత యూనిట్లకు పంపిస్తున్నది. అవినీతిపరులకు వేగంగా శిక్షలు పడినప్పుడే బాధితులు మరింత ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదులు చేసే అవకాశం ఉండటంతో 1064 టోల్‌ఫ్రీ నంబర్‌పై ఏసీబీ అధికారులు డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో బ్యానర్లు, వాల్‌పోస్టర్లు అతికించి అవినీతికి వ్యతిరేకంగా ప్రచారం చేయడంతోపాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు బోనస్

18.27 కోట్లు అందిస్తాం: సీఎండీ

నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో రిటైర్డ్ కార్మికులకు దీపావళి బోనస్‌గా రూ.8.27 కోట్లు అందజేయనున్నట్టు సంస్థ సీఎండీ ఎన్ బలరాం ప్రకటించారు. సంస్థ పరిధిలో రిటైర్డ్ అయిన 2,754 మంది కార్మికులకు ఒక్కొక్కరికి రూ.93,750 చొప్పున అందజేస్తామని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 24 మధ్యకాలంలో పనిచేసి రిటైర్డ్ అయిన వారి ఫెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు కింద ఈ మొత్తాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 27న రిటైర్డ్ కార్మికుల ఖాతాల్లో ఈ సొమ్మును జమచేసేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎండీ అధికారులను ఆదేశించారు.

దవాఖానల్లో 'ఫైర్ సేఫ్టీ'పై అధ్యయనం చేయండి

మంత్రి దామోదర

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణకు (ఫైర్ సేఫ్టీ) తీసుకుంటున్న జాగ్రత్తలపై అధ్యయనం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. శనివారం ఆయన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల యూపీలోని ఓ దవాఖానలో అగ్ని ప్రమాదం జరిగి పిల్లలు చనిపోయిన ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజల ప్రాణాలతో 'వాసవి' ఆటలు

- మణికొండలో రెండు అపార్ట్‌మెంట్ల మధ్య వాసవి సంస్థ ఆర్ఎంసీ నిర్వహణ
- దుమ్ము, ధూళి, వాహనాల శబ్దంతో స్థానికుల్లో భయాందోళన
- 'నమస్తే' కథనాలతో కదిలిన ప్రజలు
- ప్రాణాలు తోడేస్తున్నారని ఆందోళన
- శాంతియుత ర్యాలీకి పోలీసుల బ్రేక్
- మద్దతు పలికిన బీఆర్ఎస్, బీజేపీ
- తొలగించకుంటే పదివేలమందితో ర్యాలీ నిర్వహిస్తాం
- బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి
- అఖిలపక్షంగా మారి ఉద్యమిస్తాం
- బీజేపీ నేత తోకల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్ఎంసీ ప్లాంట్ మూసివేయాలని ఆందోళన చేస్తున్న అపార్ట్‌మెంట్ల వాసులు, పటోళ్ల కార్తీక్‌రెడ్డి

మణికొండ,నవంబర్ 23: జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్లతో నిత్యం వెలువడే దుమ్ము, ధూళి, శబ్దంతో ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడంపై రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్‌రెడ్డి, బీజేపీ నాయకుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా అపార్టుమెంట్ల మధ్య వాసవి బిల్డర్స్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ప్లాంట్‌తో తమ ఆరోగ్యాలు క్షీణించి పోతున్నాయంటూ అపార్ట్‌మెంట్ల వాసులు ఆయా శాఖల అధికారులకు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. వారి సమస్యలపై 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన వరుస కథనాలతో స్థానికులంతా ఏకమై శనివారం రెండు అపార్ట్‌మెంట్ల నివాసితుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 200 మంది అపార్ట్‌మెంట్ల వాసులతోపాటు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీగా మణికొండ మున్సిపాలిటీ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాలని తలపెట్టిన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అక్కడకు చేరుకుని స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమానికి మద్దతు పలికారు.

స్థానికుల నరకయాతన

వాసవీ అట్లాంటిస్ జనవాసాల మధ్య ఏర్పాటు చేసిన ఆర్ఎంసీ ప్లాంట్‌ను తక్షణమే మూసివేయాలంటూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళన ఉధృతం చేశారు. ఈ ప్లాంట్ వల్ల పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారని, దుమ్మూ, ధూళి, శబ్దంతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. స్థానిక రహదారులన్నీ దుమ్ముతో నిండిపోతున్నాయని, ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శాంతియుత వాతావరణంలో తమ గోడును ప్రభుత్వానికి విన్నవించాలని నిరసన చేపడితే పోలీసులు అడ్డుకుని భయాందోళనలకు గురిచేస్తున్నారని నివాసితులు ఆరోపించారు. ఆర్ఎంసీ ప్లాంటును మూసివేయాలని 11 నెలలుగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ప్లాంట్‌ను మూసివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సీతారాం ధూళిపాళ, నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్‌రావు, కీర్తిలతాగౌడ్, రూపా రెడ్డి, ప్రియాంక, ధన్‌రాజ్, ఆనంద్, ఫారూఖ్, నాగరాజు, బీజేపీ నేతలు వేణుకుమార్, భిక్షపతి యాదవ్, లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా నివాసితులు పాల్గొన్నారు.

ప్లాంట్‌ను మూసివేయకుంటే 10 వేలమందితో ధర్నా

ఆర్ఎంసీ ప్లాంట్ కారణంగా మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా, జయభేరి పీక్ లాంటి ప్రాంతాలల్లో ఐదు నిమిషాలు బయట కూర్చుంటే దుమ్ము, ధూళి పేరుకుపోతున్నదని కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. పీసీబీ నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటైన ప్లాంట్ గండిపేట మండలంలో ఎక్కడా ఉండడానికి వీల్లేదని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే 10 వేలమందితో నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆధారాలు చూపుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్యలు తీసుకోకుంటే పరిణామాలు తీవ్రం

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంసీ ప్లాంట్లపై చర్యలు తీసుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోదండరెడ్డి హెచ్చరించారు. మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా నివాసితులు నిరసన చేపట్టిన విషయం తెలుసుకుని అక్కడికొచ్చిన ఆయన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనవాసాలు, వ్యవసాయ క్షేత్రాల మధ్యలో రెడీమిక్స్ ప్లాంట్లను ఏర్పాటు చేయకూడదని స్పష్టమైన నిబంధనలున్నా, వాటిని తుంగలో తొక్కిన వాసవి నిర్మాణరంగ సంస్థపై తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఫోన్‌చేసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఎంసీ ప్లాంట్లను తక్షణమే మూసివేసేలా చర్యలకు ఆదేశించాలని కోరారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కోదండరెడ్డి హెచ్చరించారు.

అఖిలపక్షంగా ఏర్పాటై ఉద్యమిస్తాం

మణికొండ మున్సిపాలిటీలో ఆర్ఎంసీ ప్లాంట్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే అఖిలపక్షంగా ఏర్పాటై ఉద్యమిస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ప్లాంట్లను తక్షణమే మూసివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు సదస్సుకు ఏర్పాట్లు చేయండి

వ్యవసాయశాఖ అధికారులతో సీఎం సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు భారీ జనసమీకరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సభకు రాష్ట్రంలోని రైతులంతా హాజరయ్యేలా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీఎంవో స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు గోదావరి జలాలు

హైదరాబాద్ ప్రజల తాగునీటి కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని సీఎం రేవంత్‌రెడ్డి జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపుపై సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. డిసెంబర్ 1 వరకు టెండర్లు పిలిచేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రవాణాశాఖ ఆదాయ లక్ష్యాన్ని సాధించాలి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): రవాణాశాఖ అధికారులు ఈ ఏడు నిర్దేశించుకున్న ఆదాయ లక్ష్యాన్ని సాధించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో శనివారం స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రవాణాశాఖ, ఆర్టీసీపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రవాణాశాఖలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను క్లియర్ చేయాలని నిర్దేశించారు. 15 ఏండ్ల కాలపరిమితి దాటిన స్కూల్ బస్సులను సీజ్ చేయాలని, రాష్ట్రంలోని 62 రవాణాశాఖ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. యూనిసెఫ్ సహకారంతో ప్రతి స్కూల్‌లో ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 20 వరకు ఆర్టీసీ రూ. 111 కోట్ల జీరో టికెట్లను జారీ చేసిందని చెప్పారు. దీంతో రూ. 3747 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు. 1389 కొత్త బస్సులు కొనుగోలు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ సురేంద్రమోహన్, జేటీసీలు రమేశ్, మమత పాల్గొన్నారు.

రెండేండ్లలో చిన్నకాళేశ్వరం పూర్తిచేయాలి

ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, నవంబర్23 (నమస్తే తెలంగాణ): మంథని నియోజకవర్గ పరిధిలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని రెండేండ్లలో పూర్తిచేయాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జలసౌధలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి ఉత్తమ్ శనివారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పనులు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనుల పూర్తికి రూ.571.57 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. సమావేశంలో ఈఎన్సీ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖలో పదోన్నతులు

హైదరాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): కార్మిక, ఉపాధికల్పన శాఖలో ఐదుగురు సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగా పదోన్నతి కల్పించడంతోపాటు పోస్టింగులు ఇస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యాదయ్యను నిజామాబాద్ డీసీగా, ఏ రాజేశ్వరమ్మను ఆదిలాబాద్, బీ జాసన్‌ను హైదరాబాద్-2, వినీతను వరంగల్, పీ జగదీశ్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో డీసీగా నియమించారు.

పొంగులేటి పర్యటనలో పోలీసుల అత్యుత్సాహం

- దర్జాగా పార్టీ నాయకులకు ఎంట్రీ
- అధికారులను అడ్డగించి.. అవమానం
- సీఐ వాహనంలో అధికార పార్టీ నేత

సీఐ వాహనంలో కూర్చున్న అధికార పార్టీ నేత

భద్రాచలం, నవంబర్ 23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శనివారం జరిగిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం చూపారు. సాక్షాత్తు సీఐ వాహనంలో ఓ అధికార పార్టీ నాయకుడిని తిప్పుతూ కనిపించారు. మంత్రి అధికారిక పర్యటన కావడంతోపాటు భద్రాచలం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమీక్షకు నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు అధికార పార్టీ నాయకులను దర్జాగా లోనికి పంపుతూ అధికారులను మాత్రం అక్కడే నిలిపివేసి అవమానించారు. అంతేకాకుండా ఇంత లేటుగా వస్తే ఎలా అంటూ నిలదీశారు. అసహనానికి గురైన అధికారులు.. మంత్రితోపాటు డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించడానికి వెళ్లామని పోలీసులకు సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. ఒకరిద్దరు అధికారులు పోలీసులపై సీరియస్ అవుతూ మీటింగ్ హాల్‌కు వెళ్లారు. అధికార పార్టీ యువ నేత ఒకరు సాక్షాత్తు సీఐ వాహనంలోనే కనిపించారు. మంత్రి పర్యటనలో పోలీసులు.. అధికార పార్టీ నేతలకు ఇచ్చిన మర్యాద తమకు ఇవ్వకపోగా అవమానించారంటూ అధికారులు మండిపడుతున్నారు.

గ్రూప్ -1పై మళ్లీ సుప్రీంకోర్టుకు

- ప్రిలిమ్స్ 'కీ'ని సవాల్ చేస్తూ పిటిషన్
- తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదన్న టీజీపీఎస్సీ
- గూగుల్, వికీపీడియా ఆధారంగా 'కీ' రూపకల్పన
- దీనిపై అభ్యర్థుల న్యాయపోరాటం
- సోమవారం విచారణకు వచ్చే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పరీక్షలపై న్యాయపోరాటం చేస్తున్న నిరుద్యోగులు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓ వైపు హైకోర్టు మెట్లెక్కి పోరాటం చేస్తూనే మరో వైపు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే ఒక మారు జీవో-29పై సుప్రీంకోర్టుకెళ్లిన అభ్యర్థులు మళ్లీ ఫైనల్ 'కీ'పై సైతం తలుపుతట్టారు. ఫైనల్ కీలో అనేక తప్పులున్నాయని, తమ అభ్యంతరాలను టీజీపీఎస్సీ పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని కోరుతూ నిరుద్యోగులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అభ్యర్థుల తరపున అడ్వకేట్ మోహిత్‌రావు పిటిషన్ వేశారు. ఈ కేసు సోమవారం విచారణకు వచ్చే అవకాశాలున్నాయి. గ్రూప్-1 ప్రాథమిక కీని టీజీపీఎస్సీ విడుదల చేయగా 1,712 మంది అభ్యర్థుల నుంచి 6,417 అభ్యంతరాలొచ్చాయి. నిపుణుల కమిటీ సూచనల మేరకు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌లో ప్రశ్న నెంబర్ 56, 59ని తొలగించారు. ప్రశ్న నెంబర్ 115కు సరైన సమాధానం ఆప్షన్ 2 నుంచి 1 సరైనది సమాధానంగా మార్చారు. అయితే అభ్యర్థులు మొత్తం 13 ప్రశ్నల ఆన్సర్లపై అభ్యంతరాలు లేవదీశారు. ప్రశ్న నెంబర్లు 35, 41, 45, 59, 64, 66, 67, 79, 95, 106, 116, 119, 139పై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలుగు అకాడమీ పుస్తకాల్లో ఉన్న సమాచారాన్ని కోర్టుముందుంచారు. 'కీ'పై విచారణ సమయంలో టీజీపీఎస్సీ తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రమాణికం కాదని హైకోర్టుకు తెలిపింది. గూగుల్, వికీపీడియాను ప్రమాణికంగా తీసుకుని 'కీ'ని ఖరారుచేసినట్టు టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ సంస్థ ముద్రించిన పుస్తకాలు ప్రమాణికంకాదంటే ఎలా..? అంటూ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

హైకోర్టులో 15 కేసులు..

గ్రూప్-1పై దాదాపు 15 కేసులు హైకోర్టులో ఉన్నాయి. ఈ కేసుల్లో కొన్ని డివిజన్ బెంచ్, మరికొన్ని సింగిల్ బెంచ్ విచారణలో ఉన్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయంలో అభ్యర్థులు జీవో-29ని సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు హైకోర్టులోని కేసులు తేలే వరకు గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల చేయవద్దని, హైకోర్టు ఈ కేసులను త్వరగా విచారించాలని ఆదేశాలిచ్చింది. ఈ గురువారం గ్రూప్-1పై గల ఐదు పిటిషన్లను విచారించిన హైకోర్టు 26న తుది విచారణ జరుపుతామని ప్రకటించింది. అభ్యర్థులు ఒక వైపు హైకోర్టులో న్యాయపోరాటం చేస్తూనే, మరో వైపు సుప్రీంకోర్టులోనూ పోరాటానికి రెడీ అయ్యారు. జీవో-29 సహా ఫైనల్ 'కీ'పై గల కేసుల్లో న్యాయం తమవైపే ఉందని, రెండు కోర్టుల్లోనూ తమకే అనుకూలంగా తీర్పువస్తుందని అభ్యర్థులు ధీమాగా ఉన్నారు.


దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కంటి చికిత్స వికటించి చిన్నారి మృతి

ఉప్పల్, నవంబర్ 23: కంటి వైద్యం కోసం వెళ్తే ఐదేండ్ల చిన్నారి ప్రాణమే పోయిన ఘటన హైదరాబాద్ నగర పరిధిలో చోటుచేసుకున్నది. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన రవి, మౌనిక కుమార్తె అన్విక(5) కంటికి చీపురు పుల్ల తగలడంతో కంటి సమస్య ఏర్పడింది. దీంతో హబ్సిగూడలోని ఆనంద్ ఐ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యపరీక్షల అనంతరం అన్వికను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లారు. మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో చిన్నారి అపస్మారక స్థితికి చేరుకున్నది. ఎటూ తోచని వైద్యులు బాలిక కుటుంబ సభ్యులకు తెలపకుండానే మెరుగైన వైద్యం కోసం ఎల్బీనగర్‌లోని మరో దవాఖానకు తరలించారు. ఈలోగా బాలిక మృతి చెందినదని తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండా చిన్నారిని మరో దవాఖానకు తరలించారని, వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ, ఆనంద్ ఐ దవాఖాన ఎదుట కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. కాగా, జరిగిన ఘటనపై మేడ్చల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

హిందీ మహావిద్యాలయ గుర్తింపు రద్దు

- ఓయూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసిన కళాశాల
- నిర్ధారించిన విచారణ కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: హిందీ మహావిద్యాలయ కళాశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్టు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. కళాశాలలో అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్టు విచారణలో తేలడంతో వేటు వేసింది. 20 19-2022 యూజీ ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు, ఉత్తీర్ణులైన ఐదుగురు ఫెయిలైనట్టు తారుమారు చేసిన జాబితాను ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్‌కు సమర్పించింది. దీనిపై ఓయూ అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. మార్కుల జాబితాలన్నీ ఫోర్జరీ చేసినట్టుగా కమిటీ నిర్ధారించింది. 2023-24 బ్యాచ్ ట్యాబులేషన్ రికార్డ్స్ (టీఆర్)లో ప్రిన్సిపల్, సీవోఈ సంతకాలు, స్టాంపులు లేనట్టు గుర్తించింది. దీంతో పొరపాట్లు జరిగినట్టు యాజమాన్యం అంగీకరించింది. కానీ, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోకపోవడం తో స్థాయీ సంఘం తీవ్రంగా స్పందించింది. రికార్డులను సీజ్ చేయాలని కంట్రోలర్, సీడీసీ డీన్‌లను ఆదేశించింది. కళాశాల అటానమస్ ను రద్దు చేయాలని యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ అధికారులకు సిఫార్సు చేసింది.

కేటీఆర్‌పై క్రిమినల్ పిటిషన్

- 25న విచారణ జరుపనున్న కోర్టు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పరువు నష్టం కేసు నమోదు చేయాలంటూ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలైంది. వ్యాపారవేత్త సూదిని సృజన్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. అమృత్ టెండర్లపై ప్రజలను తప్పుదారి పట్టించేలా కేటీఆర్ తనపై నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అమృత్-2లో ప్యాకేజీ-1 కాంట్రాక్టును ఏఎమ్మార్- శోధ- ఐహెచ్‌పీ జాయింట్ వెంచర్ దక్కించుకున్నదని, కేటీఆర్ చెప్తున్నట్టు ఆ వెంచర్‌లో శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు 80% వాటా లేదని, కేవలం 29% మాత్రమే వాటా ఉన్నదని తెలిపారు. శోధ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి కందాళ దీప్తిరెడ్డి ఎండీగా వ్యవహరిస్తున్నారని, ఆ సంస్థలో తనకు